క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో శుక్రవారం పూలాజీబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ. పూలాజీబాబా అనుసరించిన మార్గాల ద్వారా భక్తులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోతల్‌కర్ అరవింద్‌రావు, మాజీ సర్పంచ్ బత్తుల గంగారాం, గ్రామస్తులు నరాల శ్రీనివాస్, జాదవ్ తుకారాం, కాంబ్లి కృష్ణంరాజు, కదం సంబాజీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 3న నిర్వహించే జాతర సందర్భంగా ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో పోచమ్మ, దొడ్డి మైసమ్మ, చిన్న హన్మన్ మందిరం, లంద మైసమ్మ, ఎరుకలి నాంచారమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జాతరను విజయవంతం చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. జాతరకు ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుడురు ముత్యంరెడ్డి, వీడీసీ అధ్యక్షుడు పెరమండ్ల నారాయణ, కృష్ణారెడ్డి, ప్రీతంరెడ్డి, లోక శిరీష్‌రెడ్డి, జల్దైజాకు, అన్నెల లక్ష్మణ్, బత్తుల అశోక్, పాండురంగ్, సుదర్శన్, శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

బజార్‌హత్నూర్: మండలంలోని చింతలసాంగ్వీ గ్రామంలోని నాగోబా ఆలయానికి గ్రామానికి చెందిన సెడ్మకి ప్రతిభ భారతి గంగారాం దంపతులు రూ.12 లక్షల సొంత నిధులతో నిర్మించారు. శుక్రవారం నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ శిఖరం, కలశ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మడవి ప్రకాష్, జగదీశ్వర్, విజయ, సుంగన్న, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని పాత సినిమా టాకీస్ స్థలంలో కొట్టాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వేద పండితులు సదానంద శర్మ మంత్రోచ్ఛరణల మధ్య హోమం నిర్వహించారు. భక్తజన సందోహం మధ్య ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయని ప్రత్యేక సాక్షులు తెలిపారు. బేల మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన దాదారావ్ బైక్‌పై ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ వైపు వెళ్తుండగా... ఉట్నూర్ మండలంలోని రాజన్నగూడ గ్రామానికి చెందిన రాకేశ్ ముత్నూర్ నుంచి వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి గాయాలు అవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి అదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: బ్యాంక్‌లోకి వెళ్లిన ఓ వ్యక్తి వాహనాన్ని తిరిగి వచ్చేలోపు అపహరించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ ఎస్సై ఇస్నాక్ తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం అర్లీ 'టీ' గ్రామానికి చెందిన పిట్ల గంగయ్య శుక్రవారం పని నిమిత్తం ద్వారకానగర్‌లోని ఇండియన్ బ్యాంక్‌కు వచ్చి బయట బైక్ పార్క్ చేశాడు. బ్యాంకులో పని ముగించుకుని వచ్చేలోపు బైక్ కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

బోథ్: మండల కేంద్రంలోని హనుమాన్ నగర్ వద్ద బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వివరాలు.. శుక్రవారం మండల కేంద్రం నుంచి సొనాల వైపు సాంగ్వి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తున్నారు. హనుమాన్‌నగర్ వద్ద గల మూలమలుపును తప్పించబోతుండగా బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు.

నిధులున్నా.. స్థలం లేదు

- టెండర్ల పూర్తయినా.. ప్రారంభం కాని పనులు
- యూపీహెచ్‌సీ పక్కా భవన నిర్మాణ పరిస్థితి



అద్దెభవనంలో కొనసాగుతున్న యూపీహెచ్‌సీ

కైలాస్‌నగర్: ప్రభుత్వ అభివృద్ధి పనులపై ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న మాట నిధుల కొరత. తగినన్ని నిధుల్లేకపోవడంతో చాలా అభివృద్ధి పనులు నిలిచిపోతుండటం పరిపాటిగా మారింది. కానీ ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ పనులు మాత్రం ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు. పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ నిర్వహించిన అధికారులు వాటిని ఖరారు చేసి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. ఇక పనుల ప్రారంభమే తరువాయి అనుకునే సమయంలో నిర్మాణ స్థలంపై వివాదం నెలకొంది.

రూ.1.43 కోట్ల నిధుల మంజూరు..

ఆదిలాబాద్ పట్టణ శివారు కాలనీల్లోని ప్రజలకు స్థానికంగా వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చిల్కూరి లక్ష్మినగర్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సొంత భవనం లేకపోవడంతో గత దశాబ్దకాలంగా అక్కడి అద్దె భవనంలో యూపీహెచ్‌సీని కొనసాగిస్తున్నారు. అందులో తగినంత స్థలం లేకపోవడం, ఇరుకైన గదులు ఉండటంతో వైద్యులు, సిబ్బందితో పాటు చికిత్స కోసం వచ్చే రోగులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అద్దె కష్టాలను తొలగించడంతో పాటు రోగులకు సౌకర్యవంతమైన సొంత పక్కా భవనాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో గత ఆరు నెలల కిందట రూ.1.43 కోట్ల నిధులను విడుదల చేసింది. బల్దియా అధికారులు ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించారు. ఐదుగురు కాంట్రాక్టర్లు టెండర్లను దాఖలు చేశారు. అందులో అత్యధిక మొత్తానికి కోడ్ చేసిన కాంట్రాక్టర్‌కు భవన నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. పనుల ప్రారంభమే సమయంలో స్థలంపై వివాదం తలెత్తడంతో పనులు ప్రారంభానికి నోచుకోకుండా నిలిచిపోయాయి.

కాలనీవాసుల అభ్యంతరం..

చిల్కూరి లక్ష్మినగర్ యూపీహెచ్‌సీకి పక్కా భవనం మంజూరు కాగా దాని నిర్మాణానికి అవసరమైన స్థలం కాలనీలో అందుబాటులో లేదు. దీంతో పక్కనే ఉన్న మహాలక్ష్మివాడ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జీప్లస్ వన్ అంతస్తుతో కూడిన భవనాన్ని 3800 స్క్వేర్ ఫీట్ల స్థలంలో నిర్మించేలా బల్దియా అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ భవన నిర్మాణం కోసం బోరు వేసేందుకు సిద్ధం కాగా కాలనీవాసులు అభ్యంతరం చెప్పారు. పాఠశాల ఆవరణలో ఆసుపత్రిని నిర్మిస్తే విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏం చేయలేని పరిస్థితి నెలకొనడంతో నిర్మాణ పనులకు అడ్డంకిగా మారింది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



జిల్లా కలెక్టర్ అనుమతి మేరకే మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జీప్లస్ వన్‌తో కూడిన ఆసుపత్రి భవనాన్ని నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశాం. టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనులను ప్రారంభించే సమయంలో కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించే అంశంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

– ఎం.తిరుపతి, మున్సిపల్ డీఈ

ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ప్రతిఒక్కరూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలాజీ హోమ్స్ కాలనీలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. సనాతన హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. నిత్య జీవితంలో ప్రతీరోజు సాధ్యమైనంత వరకు ఆలయాలకు వెళ్లి ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికతను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత యువత సన్మార్గంలో నడిచి భక్తి భావనలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్ రెడ్డి, మయూర్ చంద్ర, గంగ్రత్ మహేందర్, కార్తీక్, గంగాధర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



దాతలను సన్మానిస్తున్న లోక భూమారెడ్డి

తలమడుగు: తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామ ఆలయ నిర్మాణానికి దాతల సహకారం ఎంతో అభినందనీయమని విజయ డైయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. శుక్రవారం రుయాడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మెడిచల్మ స్వప్న స్మారకార్థం వారి మాతృమూర్తి రూ. 10 లక్షల 20వేల రూపాయలు విరాళంగా, సుధారపు రాములు (అన్నమయ్య) స్మారకార్థం వారి కుమారుడు సుధారపు పోతన్న స్థలాన్ని విరాళంగా ఇవ్వడంతో వారిని సన్మానించారు. మాజీ సర్పంచ్ పూంద్రు పోతారెడ్డి, గోక వెంకట్ రెడ్డి, సీఈవో శ్రీనివాస్, గంగాధర్, అశోక్, సంజీవరెడ్డి, ప్రకాష్ రెడ్డి, పోచ్చన్న, నర్సింలు, భీమన్న, సుభాష్ పాల్గొన్నారు.

ఐక్యంగా సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలి



గంగాధర్ తిలక్‌ను కలిసిన సంఘం నాయకులు

బోథ్: ఐక్యంగా ఉండి పద్మశాలి సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆల్ ఇండియా పద్మశాలీ ఎంప్లాయిస్ చైర్మన్ కుంటాల గంగాధర్ అన్నారు. శుక్రవారం బోథ్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మేరుగు భోజన్న ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఆయనను కలిశారు. ఈసందర్భంగా సంఘం అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గంగుల మల్లేష్, సిరిపురం చంద్రమోహన్, ఆడెపు కిరణ్, సిలారి అమర్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర కీలకం



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర కీలకమని గద్దర్ గళం స్వాభిమాన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోగల సుదర్శన్, పరమేశ్వర్‌లు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో గద్దర్ 77వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. త్వరలో జిల్లా కేంద్రంలో గద్దర్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్బాత్ ఖాన్, గణేష్, సురేశ్, ప్రశాంత్, లక్ష్మణ్, సురేందర్ కుమార్, సత్యవాన్ చిక్లే, శ్యామ్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పీడిత వర్గాల కోసం ప్రజా ఉద్యమంలో చేసిన సేవలు మరువలేనివని సంఘం మండల అధ్యక్షుడు ఎలుక రాజు అన్నారు. నాయకులు సోమన్న, లక్ష్మణ్, అమృత్ రావ్, లోలపు పోశెట్టి, బత్తుల ఊషన్న, చిన్నయ్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: దళిత బహుజన నాయకుడు గద్దర్ 77వ జయంతి వేడుకలను శుక్రవారం మాల సంక్షేమ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ మాట్లాడుతూ గద్దర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మేకల మల్లన్న, బొబ్బిలి సుధాకర్, గంపల ప్రభాకర్, ముల్కలా రాజేశ్వర్, బేర దేవన్న, మొట్టె కిరణ్, సింగరి అశోక్, పాశం రఘువేంద్ర పాల్గొన్నారు.

పూజలు.. అర్జీలు



జాతర పుస్తకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐటీడీఏ అధికారులు

ఇంద్రవెల్లి: పుష్యమాసం అమవాస్యను పురస్కరించుకొని మెస్రం వంశీయుల మహా పూజతో ప్రారంభమైన నాగోబా జాతర వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం నాగోబా దర్బార్ నిర్వహించడంతో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో నాగోబా ఆలయం జనసంద్రంగా మారింది. ఎన్నికల కోడ్ కారణంగా ప్రజాప్రతినిధులు, అధికారులు వేర్వేరుగా దర్శనం చేసుకున్నారు. దర్బార్ సమీపంలో ప్రభుత్వ స్టాల్స్, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావ్, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, దేవదాయ శాఖ ఈవో రాజమౌళి, కోసేరావ్, చిన్నుపటేల్, దాదారావ్, తిరుపతి పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ..

దర్బార్ సమావేశంలో భాగంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు దరఖాస్తు సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదివాసీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లా ఆదివాసీ గిరిజనులు తరలి వచ్చి గిరి వికాసం పథకంలో వ్యవసాయ బోరు బావులు, భూహక్కు పత్రాలు, ఎడ్ల జతలు, ఎడ్ల బండ్లు, ఉపాధి కోసం ట్రైకర్ రూణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

దర్బార్ సమావేశంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆసిఫాబాద్ జైనూర్ మండలంలోని మార్లావాయి కనక రాజు గుస్సాడీ బృందం నృత్యం పాటు భద్రచలం ఆదివాసీ కళాకారుల కొమ్ము నృత్యం, వివిధ పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థినులు సంప్రదాయ నృత్యాలు చేశారు. సంప్రదాయ పూజల ఫొటోలు తీయడానికి ప్రత్యేకంగా మెస్రం వంశీయులు నియమించిన ఫొటోగ్రాఫర్ ప్రశాంత్‌రెడ్డిని మంత్రి సీతక్క శాలువాతో సన్మానించారు.

ఎంపీటీసీ స్థానాలపై అభ్యంతరాలు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్: బోథ్, సొనాల మండలాల్లో ఎంపీటీసీ స్థానాలను అధికారులు గుర్తించి, శుక్రవారం వరకు అభ్యంతరాలను తెలపాలని పేర్కొనగా.. బోథ్, సొనాల మండలవాసులు పలు అభ్యంతరాలను ఎంపీడీవో రమేశ్‌కు అందజేశారు. బోథ్ మండలంలోని బాబెర ఎంపీటీసీ స్థానాన్ని రెండు ఎంపీటీసీ స్థానాలుగా చేయాలని విన్నవించారు. కనుగుట్ట ఎంపీటీసీ స్థానం పరిధిలోని కుచులాపూర్, పిప్పల్‌ధరి గ్రామస్తులు తమ గ్రామాలను పాత ఎంపీటీసీ స్థానం పొచ్చెరలోనే ఉంచాలని లేదా రెండు గ్రామాలను కలిపి ఎంపీటీసీ స్థానంగా చేయాలని కోరారు. కాగా సొనాలలో అధికంగా జనాభా ఉందని, సొనాల మండల కేంద్రంలో మరో ఎంపీటీసీ స్థానం పెంచాలన్నారు.

దూషించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి



డీఎస్పీతో సమితి నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: యువజన సంఘాల అధ్యక్షుడు బాల శంకర్ కృష్ణను కులం పేరుతో దూషించిన చామల ప్రశాంత్ అనే వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న కోరారు. శుక్రవారం డీఎస్పీ జీవన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కులం పేరుతో దూషించి దాడి చేసి భయభ్రాంతులకు గురిచేసిన సదరు వ్యక్తిని శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, సందీప్, శశికాంత్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండలంలోని వాంకిడి గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. తన చిన్ననాడు చదువుకున్న గ్రామాన్ని మర్చిపోకుండా పైలెట్ ప్రాజెక్టులో గుర్తించి గ్రామంలో అందరికీ పథకాలు అందేలా కృషి చేశారని కొనియాడారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ కాడారి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన సూది రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ శుక్రవారం గ్రామానికి చేరుకుని రాములు కుమారులు సూది నంది నర్సయ్య, సూది వినాయక్‌లను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

రక్తదానమే మహాదానం

ఉట్నూర్‌రూరల్: రక్తదానమే మహాదనమని లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కారం గ్రామంలో సీతాగోంది ఆత్రం రాజాదేవుషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ సీతాగోంది ఆత్రం సుధాకర్‌రావు స్మారకార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి భీంరావు, గాధర్, మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, రఘు, ధరణి రాజేశ్, సత్తన్న, రాజ్‌గోపాల్, అశోక్, సరస్వతి, బూమన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నార్నూర్: మండలంలోని గుంజాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమ్ర సావిత్రిబాయి (70) అనారోగ్యంతో బాధపడుతూ.. శుక్రవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు కథనం ప్రకారం.. సావిత్రిబాయి గత కొన్ని రోజులుగా ఆస్తమాతో బాధపడుతుంది. గురువారం అనారోగ్యానికి గురి కావడంతో వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యం పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. గత సర్పంచ్ ఎన్నికల్లో గెలిచి అదర్శవంతమైన పాలనను అందించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసస్వామి

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆటలు ఆడడం వలన మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నాందేవ్, కృష్ణవేణి, రమాకాంత్ పాల్గొన్నారు.

కళాకారులతో మంత్రి సీతక్క నృత్యం



నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు



కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా జాతరలో భాగంగా శుక్రవారం నాగోబా దర్బార్‌లో రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రితో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి, ఎమ్మెల్సీ దాండే విఠల్‌తో పాటు మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కళాకారులతో కలిసి చేసిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. ప్రజాప్రతినిధులు చేసిన సంప్రదాయ నృత్యాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

అమరవీరుల స్థూపం వద్ద నివాళి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి మంత్రి సీతక్క నివాళులర్పించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అమరవీరుల స్తూపం వద్ద కొనసాగుతున్న స్మృతివనం అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా స్మృతివనం పనులను పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతి, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆత్రం సుగుణ పాల్గొన్నారు.